గ్రేడ్ - I

కలసి వుంటే కలదు సుఖం

డా॥ యం. హరికిషన్

గ్రేడ్ - I సంయుక్త అక్షరాలు లేని చిన్న కథలు

కలసి వుంటే కలదు సుఖం

రచన

డా॥ యం. హరికిషన్

కర్నూలు ప్రచురణలు

కలసి వుంటే కలదు సుఖం

ఒకసారి రంగయ్య చేతికుండే ఐదు వేళ్ళకూ గొడవ వచ్చింది.

'అందరికంటే లావుగా, బలంగా వుండేది నేనే, నేను లేకుంటే ఏ పనీ జరగదు కాబట్టి నేనే గొప్ప' అంది బొటన వేలు.

'అసలు మీ అందరికన్నా పొడుగుండేది నేను కాబట్టి నేనే గొప్ప' అంది నడిమి వేలు.

'ఏది ఎక్కడ వుందో చూపించేదాన్ని నేను కాబట్టి నేనే గొప్ప' అంది చూపుడువేలు.

'బంగారు ఉంగరమయినా, రతనాల ఉంగరమయినా మొదట తొడిగేది నాకే కాబట్టి నేనే గొప్ప' అంది ఉంగరపు వేలు.

'దేవునికి మొక్కేటప్పుడు అందరికన్నా ముందుండేది నేను కాబట్టి నేనే గొప్ప' అంది చిటికెన వేలు.

ఐదువేళ్ళూ గొడవపడి ఒకదానికొకటి సాయం చేసుకోవడం మానివేశాయి

దాంతో... రంగయ్య ఏ పనీ చేయలేక పోయాడు.

చివరికి అన్నంగూడా తినలేక పోయాడు.

నీరసంగా పడిపోయాడు.

దాంతో... ఐదువేళ్ళూ 'మనమంతా కలసివుంటేనే బతకగలం' అని తెలుసుకున్నాయి.

అప్పటినుండీ గొడవలు మానేసి కలసిమెలసి వుండసాగాయి.



నాయకుడు

లొద్దిపల్లె అనే ఊరి పక్కన ఒక చిన్న చెరువు వుంది.

ఆ చెరువులో చేపలు చాలా వున్నాయి.

చిన్ని అనే చేప వాటికి రాజుగా వుండేది.

ఒక రోజు చేపలన్నీ ఆడుకుంటూ వున్నాయి.

ముగ్గురు జాలరులు చేపలు పట్టడానికి వలలు తీసుకొని అటువైపు రావడం దూరం నుండే చిన్ని చూసింది.

వెంటనే చేపలన్నింటినీ పిలిచింది.

'మనలని పట్టుకోడానికి జాలరులు రావడం చూశాను.

ఆ జాలరులు రాగానే మనమందరం కదలకుండా నీళ్ళపైన తేలుదాం.

చేపలన్నీ చచ్చిపోయాయి అనుకొని వాళ్ళు వెళ్ళిపోతారు' అని చెప్పింది.

చేపలన్నీ 'సరే' అన్నాయి.

జాలరులు అక్కడికి వచ్చేసరికి చేపలన్నీ ఎల్లకిల్లా పైకి తేలాయి.

ఆ చేపలని చూసిన జాలరులు 'అరెరే... చేపలన్నీ చచ్చిపోయాయే...

ఈ చచ్చిన వాటిని ఎవరు కొంటారు' అనుకొని తిరిగి వెళ్ళిపోయారు.

చేపలన్నీ తమని కాపాడిన చిన్నిని అభినందించాయి.



ఏది గుడ్డిది ?

ఒక రైతు దగ్గర ఒక ఆవు వుండేది.

ఒకరోజు ఒక దొంగ దాన్ని ఎత్తుకపోయాడు.

రైతు చాలా బాధపడ్డాడు. ఇంటిలో పాలకు ఇబ్బంది అయింది.

ఇంకొక ఆవును కొందామని పక్క ఊరిలో జరుగుతున్న సంతకు పోయాడు. ఆ దొంగకూడా అదే సంతకు ఎత్తుకపోయిన ఆవును అమ్మడానికి తెచ్చాడు.

ఆవును చూడగానే రైతు అది తనదే అని కనుక్కున్నాడు.

కానీ ఆ దొంగ ఆ ఆవు తనదే అన్నాడు.

ఇద్దరూ ఆవు నాదంటే నాదని గొడవ పడడంతో జనాలంతా గుంపు అయ్యారు. రైతు ఛటుక్కున ఆవు రెండు కళ్ళు మూసేసి ‘ఈ ఆవు నీదే అయితే దీని రెండు కళ్ళలో ఏది గుడ్డిదో చెప్పుకో చూద్దాం’ అన్నాడు. దొంగ ఆలోచించి ‘కుడివైపుది’ అన్నాడు. రైతు ‘కాదు’ అన్నాడు.

వెంటనే దొంగ తడబడుతూ కుడి వైపుది కాదు, ఎడమ వైపుది అన్నాడు.

రైతు జనాలతో “అయ్యలారా ! దీని రెండు కళ్ళూ బాగానే వున్నాయి. దొంగను పట్టించడానికే ఒక కన్ను గుడ్డిదని చెప్పాను. కావాలంటే చూడండి” అని చేతులు తీసేశాడు.

జనాలంతా ఆవు వంక చూశారు. రైతు చెప్పినట్టే ఆవు రెండు కళ్ళూ బాగున్నాయి.

దాంతో వాళ్ళు దొంగను మెత్తగ తన్ని ఆవును రైతుకు ఇప్పించారు.

అందులో సందేహం ఎందుకు ?

వెంకటప్ప ఒకసారి తిరునాలకు పోయాడు.

ఆ తిరునాలలో ఒకడు పక్షులను అమ్ముతూవుంటే పోయి ఒక చిలుకను చూపించి "దీని ఖరీదు ఎంత?" అని అడిగాడు.

అతను "రెండు వేలు" అని చెప్పాడు.

"ఏమిటీ ఈ చిలుక ఖరీదు రెండు వేలా" అన్నాడు వెంకటప్ప.

అతను నవ్వి "ఇది మామూలు చిలుక కాదు. మాటలాడే చిలుక. కావాలంటే దీని ఖరీదు రెండువేలు అవునో ... కాదో ... దానినే అడుగు" అన్నాడు.

వెంకటప్ప చిలుక దగ్గరకు పోయి "నీ ఖరీదు రెండు వేలా?" అని అడిగాడు.

వెంటనే ఆ చిలుక "అందులో సందేహం ఎందుకు" అంది.

వెంకటప్ప సంబరంగా దానిని కొనుక్కొని ఇంటికి తీసుకు పోయాడు.

కానీ... ఆ చిలుక ఏం అడిగినా "అందులో సందేహమెందుకు" అనే ఒక్క మాట తప్పితే వేరే మాట పలకలేదు.

దాంతో వెంకటప్పకు జరిగిన మోసం తెలిసిపోయింది.

"ఛీ.... ఛీ.... నేనొట్టి తెలివితక్కువ వెధవను .... అందుకే మోసపోయాను" అన్నాడు.

వెంటనే ఆ చిలుక "అందులో సందేహమెందుకు?" అంది.

ముందు చూపు

ఒక ఊరిలో ఒక రాజు ఉండేవాడు.

ఆయన ఒకరోజు వేటకు పోతూవుంటే దారిలో ఒక ముసలాయన కనబడ్డాడు.

అతను ఒక మొక్క నాటుతూ వున్నాడు.

రాజు అది చూసి నవ్వుతూ "ఒరే ముసిలోడా ... ఈ మొక్క ఎప్పటికి పెద్దగవుతాది. నువ్వెప్పటికి కాయలు తింటావు. అసలు అంతకాలం నువ్వు బతుకుతావా" అన్నాడు.

అతను నవ్వి "రాజా ... ఈ మొక్క నాటుతూ వుంది నా కోసం కాదు. నా పిల్లల కోసం, మనవళ్ళ కోసం. ఇప్పుడు మనకు కాయలు ఇచ్చేవన్నీ ఒకప్పుడు మన తాతలు నాటినవే కదా! నాకెందుకులే అని వాళ్ళు అనుకొనింటే ఇప్పుడు మనం ఇవన్నీ తినేవాళ్ళమా" అన్నాడు.

ఆ మాటలకు రాజు సిగ్గుతో తల దించుకొన్నాడు.

తగిలేది నీకే

ఒక సాధువు ఒక ఇంటి ముందు నిలబడి 'అమ్మా... ఏమయినా వుంటే దానం చేయి తల్లీ' అని పిలిచాడు.

ఆ ఇంటి యజమానికి తాను పెద్ద ధనవంతున్నని చాలా పొగరు.

ఒక పావుగంటకు బైటకు వచ్చాడు.

'దున్నపోతులెక్కున్నావు. పనీ పాటా చేసుకోగూడదా' అంటూ నోటికి వచ్చినట్టు తిట్టాడు.

ఆ సాధువు చిరునవ్వుతో అలాగే నిలబడ్డాడు.

ఆ ధనవంతునికి ఇంకా కోపం పెరిగిపోయింది.

మరలా నోటికి వచ్చినట్టు తిట్టసాగాడు.

అప్పుడు ఆ సాధువు 'అయ్యా... నీవు నాకు ఒక ఆవును ఇచ్చావనుకో. దానిని నేను తీసుకోలేదనుకో. అది ఎవరికి చెందుతుంది?' అని అడిగాడు.

'నాకే చెందుతుంది. ఏం?' అన్నాడు ధనవంతుడు.

'ఏమీ లేదు. ఇంతకుముందు నువ్వు తిట్టిన మాటలు గూడా నేను తీసుకోవడం లేదు' అంటూ సాధువు వెళ్ళిపోయాడు.

తేలు కాటు

విజయనగరంలో దొంగలు ఎక్కువయ్యారు.

రోజుకొక ఇంటిలో దొంగతనం చేయసాగారు.

తెనాలి రామలింగడు ఏదో ఒకరోజు తన ఇంటిలో కూడా దొంగలు పడతారని ముందే ఊహించాడు.

ఒక మంచి తేలును తెచ్చి అగ్గిపెట్టెలో పెట్టి గూటిలో పెట్టాడు.

పెళ్ళానికి ఏం చేయాలో ముందే చెప్పాడు.

ఒకరోజు చీకటి పడ్డాక ఒక దొంగ ఇంటిలోకి దూరాడు.

ఆ విషయాన్ని పసిగట్టిన రామలింగడు "ఏమే... మొన్న కొన్న బంగారు ఉంగరం ఇనుపపెట్టెలో దాచావా.... లేదా..." అని గట్టిగా అడిగాడు.

"లేదండి... గూటిలోని అగ్గిపెట్టెలో వుంది. పొద్దున్నే దాచిపెడతాలే" అంది ఆమె.

దొంగ అదంతా విన్నాడు.

సంతోషంగా చప్పుడు చెయ్యకుండా గూటి దగ్గరికి పోయాడు.

అగ్గిపెట్టె తెరిచి ఉంగరం కోసమని లోనికి ఏలు పెట్టాడు.

అంతే... తేలు కసుక్కున ఆ దొంగను కుట్టింది.

దొంగ నొప్పికి తట్టుకోలేక అమ్మా... అబ్బా అని అరవడం మొదలుపెట్టాడు.

ఆ అరుపులకు చుట్టుపక్కల జనాలంతా లేచారు.

దొంగను పట్టేశారు.

కందిరీగ - తేనెటీగ



ఒకరోజు ఒక కందిరీగ, ఒక తేనెటీగ దగ్గరికి వచ్చింది.

"మనమిద్దరం చూడటానికి ఒకేలా వుంటాము"

ఇద్దరమూ ఎగురుతూ ఝుమ్మని సంగీతం పాడతాము.

ఇద్దరమూ మనుషులను కుడతాము.

కానీ జనాలంతా నిన్ను పొగుడుతారు. నన్ను తిడతారు. ఎందుకు?'

అని అడిగింది.

తేనెటీగ నవ్వుతూ 'నిజమే మనమిద్దరం ఒకేలా వుంటాము.

కానీ నేను నాకు హాని చేయడానికి వచ్చిన వాళ్ళనే కుడతాను.

కానీ నీవు కనబడిన వాళ్ళనంతా కుడతావు.

అందుకే నిన్ను తిడతారు.

నన్ను మెచ్చుకుంటారు' అని చెప్పింది.

గ్రేడ్ - I

కలసి వుంటే కలదు సుఖం

డా॥ యం. హరికిషన్